సాక్షి విశాఖపట్నం

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల జోలికొస్తే ఖబడ్దార్ 8లో



బీచ్‌రోడ్డులో కారు బీభత్సం 8లో



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం సాధిద్దాం 8లో











ఒళ్లా.. విల్లా

ఈ చిన్నారుల జిమ్నాస్టిక్స్ విస్మయానికి గురిచేశాయి. శరీరాన్ని విల్లులా ఎటువైపు అంటే అటువైపు.. ఎలా అంటే అలా వంచుతూ రకరకాల విన్యాసాలు చేస్తూ ఉంటే.. అక్కడికి వచ్చినవారు కళ్లప్పగించి చూస్తుండిపోయారు. అంతగా వారి విన్యాసాలు కట్టిపడేశాయి. పాండురంగాపురంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఇండోర్ హాల్‌లో జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఎంతో నేర్పరిగా చేసిన జిమ్నాస్టిక్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



క్యాన్సర్‌ను ఓడించి.. క్రీడల్లో మెరిసి..!

కష్టాలను జయించి.. స్వప్నాలను సాకారం చేసుకున్న పోరాట యోధురాలు ఆమె. చిన్న వయసులోనే క్యాన్సర్ తన జీవితాన్ని కుదిపే సినా ధైర్యంగా ఎదుర్కొంది. ఈ క్రమంలో కాలు కోల్పోయినా.. ఆత్మస్థైర్యం మాత్రం కోల్పోలేదు. తన బలహీనతను బలంగా మార్చుకుని.. పోరాటానికి సిద్ధమైంది. పారా క్రీడల్లో తనను తాను నిరూపించుకుంటూ.. రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. ఆమే మధురవాడకు చెందిన నిధి. ఆమె ఒక క్రీడా కారిణిగానే కాకుండా.. కష్టాలను ఎలా అధిగమించాలనే దానికి ఒక సాక్ష్యం. ఆమె కథ మనందరికీ స్ఫూర్తినిస్తుంది. ఆమె విజయాలు ప్రేరణగా నిలుస్తాయి. భవిష్యత్తులో నిధి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిద్దాం. – విశాఖ స్పోర్ట్స్



పారా స్విమ్మింగ్ పోటీల్లో నిధి

- పారా పోటీల్లో 'నిధి'సత్తా
- పతకాలు కొల్లగొడుతున్న మధురవాడ బాలిక

విశాఖలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో నిధి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కృత్రిమ కాలుతో నడుస్తూ.. నాలుగు క్రీడాంశాల్లో పోటీపడుతున్న ఆమె చిన్న వయసులోనే ఎన్నో కష్టాలను ఎదుర్కొంది. మధురవాడ ప్రాంతానికి చెందిన నిధి తండ్రి కేశవరావు, తల్లి జ్యోతి. ప్రస్తుతం ఆమె 10వ తరగతి చదువుతోంది. ఏడేళ్ల వయసులోనే ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధుల్లో ఒకటైన క్యాన్సర్ బారిన పడింది. చికిత్సలో భాగంగా ఆమె ఎడమ కాలును కోల్పోయింది. ఈ క్రమంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని.. క్యాన్సర్‌ను జయించి మామూలు స్థితికి చేరుకుంది. అంగవైకల్యాన్ని మరిచిపోయేందుకు ఆటలను ఎంపిక చేసుకుంది. కృత్రిమ కాలుతో కదన రంగంలోకి దిగింది. పట్టుదలతో స్విమ్మింగ్, చదరంగం, రైఫిల్ షూటింగ్, రన్నింగ్‌లో శిక్షణ పొందింది. పారా క్రీడల్లో తాను తలపడుతున్న అన్ని అంశాల్లోనూ నేడు పతకాలు సాధించే స్థాయికి చేరుకుంది. ఇటీవల రష్యాలో జరిగిన పారా క్రీడల్లో నాలుగు పతకాలను సొంతం చేసుకుంది.

మలుపు తిప్పిన సర్వైవర్స్ క్యాంప్

అంగవైకల్యం ఏర్పడినా క్యాన్సర్‌ను జయించిన నిధి నిబ్బరంగానే నిలిచింది. చదువుకుంటూనే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆటలపై ఆసక్తిని పెంచుకుంది. అప్పట్లో ముంబయిలో క్యాన్సర్ చికిత్స తీసుకున్న ఆమె.. క్యాన్సర్ సర్వైవర్స్‌లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు నిర్వహించిన పోటీల్లో పాల్గొంది. తనలాంటి వారితో నిర్వహించే పోటీల్లో పోటీపడగలననే ధీమాతో.. వారిచ్చిన శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంది. అలా రాంచీలో జరిగిన జాతీయస్థాయి చదరంగం అండర్–19 పోటీల్లో తొలిసారి పాల్గొని సత్తా చాటింది.

జాతీయ పారా స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

2019లో కరోనా కారణంగా పోటీల్లో పాల్గొనడం కాస్త తగ్గించింది నిధి. అప్పటికే ముంబయి నుంచి విశాఖకు తల్లిదండ్రులతో వచ్చేసిన నిధి తిరిగి గ్వాలియర్‌లో జరిగిన పారా స్విమ్మింగ్ పోటీల్లో తన కేటగిరీలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఇటీవల రష్యాలో జరిగిన రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతకం, చెస్, స్విమ్మింగ్‌లతో పాటు రన్నింగ్‌లో స్వర్ణ పతకాలను అందుకుంది. ఆదివారం విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో ఎస్–9 కేటగిరీలో తలపడింది. 50 మీటర్ల ఫ్రీస్టయిల్, బ్యాక్ స్ట్రోక్, వంద మీటర్ల ఫ్రీస్టయిల్ పోటీల్లో విజేతగా నిలిచింది. వచ్చే నెలలో గోవాలో జరగనున్న జాతీయ పారా స్విమ్మింగ్ పోటీలకు సిద్ధమవుతోంది.



నేత్రపర్వం నృత్యోత్సవం

భారతీయ సంప్రదాయ నాట్య ప్రదర్శనలతో కళాభారతి ఆడిటోరియం పులకించిపోయింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన నాట్యకళాకారులు తమ ప్రదర్శనలతో ఓలలాడించారు. వైశాఖీ నృత్యోత్సవ్‌లో భాగంగా కేరళకు చెందిన చిత్రా సుకుమారన్ చేసిన మోహినీ యాట్టం అలరించింది.

సందడిగా కేక్ మిక్సింగ్

బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో ఆదివారం క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుక ఘనంగా జరిగింది. హోటల్‌లో ఉండే అతిథులతో పాటు నగరవాసులతో సంగీత, నాట్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి క్రిస్మస్ కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్నారు. వైన్, డ్రై ఫ్రూట్స్ వినియోగించారు. క్రిస్మస్ ముందు రోజు కేక్ తయారు చేసి ఆరోజు హోటల్‌కు వచ్చే అతిథులకు ఇస్తారు. అంతకుముందు యువతీయువకులు గ్రేప్ స్టాంపింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

– బీచ్‌రోడ్డు



సెంట్రల్ జైలులో హీరో నాని

కొమ్మాది : అడవివరం సెంట్రల్ జైలులో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న హిట్–3 సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఈ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం నుంచి విశాఖపట్నంలో పలు ప్రాంతాల్లో ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.



ఉచ్ఛిష్ట గణపతి లడ్డూ @ రూ.15,15,550

గాజువాక: ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీనగర్‌లో ప్రతిష్ఠించిన 89 అడుగుల ఉచ్ఛిష్ట మహాగణపతి స్వామి ప్రసాదం లడ్డూ రూ.15,15,550 పలికింది. స్వామి అనుపోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలం పాట పోటాపోటీగా సాగింది. వేలంలో 16 మంది లడ్డూను దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. చివరకు రూ.15,15,550కు లడ్డూను స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి పప్పల ఆదిబాబు దక్కించుకున్నారు. ఉత్సవ నిర్వాహకుడు కోసిరెడ్డి గణేష్ ఆయనకు లడ్డూ అందించారు. వినాయక లడ్డూ ఇంత భారీ ధర పలకడం ఇదే తొలిసారి. ఈ లడ్డూను స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొంటున్న కార్మికులకు పంపిణీ చేస్తానని ఆదిబాబు తెలిపారు.



ఆదిబాబుకు లడ్డూను అందజేస్తున్న నిర్వాహకులు

రైతు బజార్లకు వారాంతపు సెలవులు

మహారాణిపేట: అన్ని రైతు బజార్లకు వారాంతపు సెలవులను పునరుద్ధరిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వినియోగదారులు అభ్యర్థన మేరకు అన్ని రైతు బజార్లలో వారాంతపు సెలవులను తిరిగి అమలు చేస్తామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సీతమ్మధార, కంచరపాలెం రైతు బజార్లకు మంగళవారం, ఎంవీపీ కాలనీ, నరసింహనగర్ రైతు బజార్‌కు బుధవారం సెలవు కొనసాగుతుందని వివరించారు. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

లోకో.. ఇక రయ్ రయ్..!

- వాల్తేరులో డీజిల్ లోకో షెడ్ ఆధునికీకరణ
- రూ.115 కోట్లతో టెండర్లు ఆహ్వానించిన డివిజన్ అధికారులు
- ప్రస్తుతం 2 నుంచి 6 వేల హార్స్ పవర్ లోకోల నిర్వహణ
- 9 వేల జీహెచ్‌పీతో నిర్వహించేలా ఆధునికీకరణ పనులు

సాక్షి, విశాఖపట్నం: ఆసియాలోనే అతి పెద్ద డీజిల్ లోకో షెడ్‌గా పేరొందిన వాల్తేరు డీజిల్ లోకో షెడ్ (డీఎల్‌ఎస్‌వీ) ఇప్పటికే ఎన్నో మైలు రాళ్లు అధిగమించింది. నిర్వహణలో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. 150 లోకోషెడ్‌లు నిర్వహించే సామర్థ్యం ఉన్న ఈ డీజిల్ లోకో షెడ్.. కోవిడ్ సమయంలో నిర్దేశించిన సామర్థ్యానికంటే రెండింతలు నిర్వహణ పూర్తి చేసి చరిత్ర సృష్టించింది. 310 లోకోలు మెయింటెనెన్స్‌కు కేటాయించగా.. నిర్దేశించిన సమయం కంటే ముందుగానే పూర్తి చేసి అబ్బురపరిచింది. ఇండియన్ రైల్వేలో ఎక్కడా లేని విధంగా 9.48 శాతం ఉత్పాదన సగటు నమోదు చేసి దేశంలోనే అగ్రగామిగా కొనసాగుతోంది. దేశంలో ఈ లోకోకి అనుబంధంగా ఉన్న ఇంజిన్లను ఇక్కడికి మాత్రమే తీసుకొచ్చి సర్వీసింగ్ చేస్తారు. సంబంధిత ఇంజిన్ ఎక్కడ ఉన్నా.. ఇక్కడ నుంచే స్టాఫ్ వెళ్లి మరమ్మతు ప్రక్రియ పూర్తి చేస్తుండటం విశేషం. 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ డీజిల్ లోకోషెడ్ ఏటా 347 లోకోలు సర్వీసింగ్ చేపడుతుంటుంది. ఇందులో 290 డీజిల్ లోకోలుండగా.. 57 ఎలక్ట్రికల్ లోకోలుంటాయి. ఇక్కడ ఎలక్ట్రికల్ ఇంజిన్ల నిర్వహణను పెంచేందుకు రూ.92.5 కోట్లతో అనుబంధంగా 10 ఎకరాల స్థలంలో ఎలక్ట్రికల్ లోకోషెడ్ ఏర్పాటు



చేశారు. ఇప్పుడు మరింత ఆధునికీకరించేందుకు అడుగులు పడుతున్నాయి.

ఇకపై 9 వేల హార్స్‌పవర్ లోకోలు

లోకోషెడ్ ఆధునికీకరించేందుకు రైల్వే బోర్డు నిర్ణయించిన నేపథ్యంలో వాల్తేరు డివిజన్ అధికారులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం 6 వేల హార్స్‌పవర్ లోకోల నిర్వహణ చేపడుతున్నారు. ఇకపై రికార్డు స్థాయిలో 9 వేల గ్రాస్ హార్స్‌పవర్(జీహెచ్‌పీ)ల నిర్వహించేలా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. హార్స్ పవర్ పెరిగితే ఇంజిన్ సామర్థ్యం పెరుగుతుంది. మొత్తం రూ.115. 19 కోట్లతో ఈప్రాక్యూర్‌మెంట్ టెండర్లను ఆహ్వానించారు. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో టెండర్లు పిలిచారు. హై హార్స్‌పవర్ సామర్థ్యంతో లోకోల నిర్వహణ ప్రక్రియ చేపడితే.. మరిన్ని ఇంజిన్ల సర్వీసులను త్వరితగతిన పూర్తి చేయవచ్చు. సామర్థ్యం పెరిగితే లోకోషెడ్‌కు మరిన్ని లోకోలు మెయింటెనెన్స్‌కు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ తరహా జీహెచ్‌పీ నిర్వహిస్తున్న లోకోషెడ్స్ దేశంలో అతి తక్కువ మాత్రమే ఉన్నాయి. ఈ ఆధునికీకరణ పనులు పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో 9 వేల హెచ్‌పీ నిర్వహణ సామర్థ్యం ఉన్న లోకోషెడ్‌గా డీఎల్‌ఎస్‌వీ రికార్డు సృష్టిస్తుంది. టెండర్లు ఖరారు చేసిన 15 నెలల్లో అందుబాటులోకి రానుంది. లోకో వాషింగ్ ప్లాంట్‌కు సమీపంలో ఈ ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు డీఎల్‌ఎస్‌వీ అధికారులు చెబుతున్నారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారు

- నిత్యావసరాల ధరలు పెరగడంతో ప్రజలకు ఇబ్బందులు
- ప్రజావ్యతిరేకతను మళ్లించేందుకే.. తెరపైకి లడ్డూ వ్యవహారం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

ఎంవీపీకాలనీ : వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేయడంతో పాటు హత్యలు, అత్యాచారాలు, దాడులతో రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిందని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. లాసన్స్ బే కాలనీలోని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడం, విజయవాడ వరదల్లో ప్రజలకు సాయం అందించడం, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడం ఇలా అన్నింటా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ వైఫల్యాలపై ప్రజా వ్యతిరేకతను దారిమళ్లించేందుకు తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంటూ దేవుణ్ని చంద్రబాబు రాజకీయాల్లోకి లాగారన్నారు. ఈ ఆరోపణ ద్వారా తన మార్కు నీచరాజకీయానికి మరోసారి తెరతీశారన్నారు. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడంటూ ఎద్దేవా చేశారు. జులైలో కల్తీ నెయ్యి ట్యాంకర్లను వెనక్కి పంపిస్తే సెప్టెంబర్‌లో దాన్ని చంద్రబాబు వివాదం చేయడమే ఇందుకు నిదర్శమన్నారు. అంతర్జాతీయంగా చర్చనీయాంశమైన లడ్డులో కల్తీ నెయ్యి వ్యవహారంపై సీబీఐ విచారణ కోరకుండా పూటకో అబద్ధం చెబుతూ చంద్రబాబు తన తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చిత్తశుద్ధి ఉంటే కల్తీపై నిజాలు నిగ్గుతేల్చేందుకు సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీతో పొత్తులో ఉన్న టీటీడీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలపై స్పష్టమైన ప్రకటన కూడా చేయించలేని అసమర్థతలో ఉందన్నారు. ఇటీవల కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నం జరగ్గా కార్మికుల వ్యతిరేకతతో దానికి తాత్కాలికంగా బ్రేక్ పడిందన్నారు. అయితే ప్రైవేటీకరణపై ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొందన్నారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే చంద్రబాబు ప్రభుత్వం కనీసం ధరల నియంత్రణపై సమీక్ష కూడా నిర్వహించలేదన్నారు. సంపద సృష్టిస్తాను, ధరలు నియంత్రిస్తానంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు 100 రోజుల పాలనలో అన్నింటా విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండక్కి ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగ వేళల్లో పలు ప్రత్యేక రైళ్లు నడపడంతోపాటు పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖ-సికింద్రాబాద్-విశాఖ, విశాఖ-తిరుపతి-విశాఖపట్నం, విశాఖ-బెంగళూరు-విశాఖ, విశాఖ-అరకు-విశాఖ, విశాఖ- ఎంజీఆర్ చెన్నై - విశాఖ, విశాఖ-షాలిమర్- విశాఖ, శ్రీకాకుళం రోడ్-తిరుపతి-శ్రీకాకుళం రోడ్, శ్రీకాకుళం రోడ్-కొల్లాం-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా పలు రెగ్యులర్ రైళ్లకు జనరల్ క్లాస్, స్లీపర్‌క్లాస్, థర్డ్ ఏసీ వంటి కోచ్‌లను అదనంగా జతచేస్తున్నట్లు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో పద్మశ్రీ ఇలియానా సిటారిస్టి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సిటారిస్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఒడిశా నృత్యకళాకారిణి ఇలియానా సిటారిస్టి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రసాదాలను ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ అందజేశారు.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.సంపత్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, యూసీడీ, ఇంజినీరింగ్, హార్టికల్చర్ తదితర విభాగాలకు సంబంధించి సమస్యలుంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బోడికొండకు నామాలు

- కుసులవాడ, పందలపాక పంచాయతీల్లో యథేచ్ఛగా టీడీపీ నేతల అక్రమణలు
- బోడికొండపై వంద ఎకరాల బంజరు భూమిలో నీలగిరి మొక్కలు
- గతంలో హెచ్చరికల బోర్డులు పెట్టిన చోటే మళ్లీ మొక్కలు
- వారం రోజులుగా యంత్రాలతో పనులు



బంజరులో నాటిన నీలగిరి మొక్కలు



హెచ్చరిక బోర్డు ఉన్న చోటే మళ్లీ నాటిన మొక్కలు

తగరపువలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందని భయపడ్డామో అదే జరుగుతోంది. నాలుగు నెలల పాలనలో సంక్షేమ పథకాలకు పాతరేసిన ప్రభుత్వం.. దర్జాగా ప్రభుత్వ భూములను కబ్జా చేసుకోమని ఆ పార్టీ నేతలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ఉంది. దీంతో ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా రాబందుల్లా వాలిపోతూ ఆక్రమించేస్తున్నారు. తాజాగా ఆనందపురం మండలంలో టీడీపీ నాయకులు బరితెగించి ప్రభుత్వ భూములను చెరపడుతున్నారు. ఇటీవల కుసులవాడ పంచాయతీలోని సర్వే నంబర్ 248లో దళితుల సాగులో ఉన్న సుమారు 20 ఎకరాల్లో జీడి తోటలను తొలగించిన టీడీపీ నాయకులు.. నీలగిరి మొక్కలు నాటేశారు. ఇదే పంచాయతీలోని చిన్నయ్యపాలెంలో సత్యనారాయణ అనే టీడీపీ నాయకుడు 2014-19 మధ్య టీడీపీ పాలనలో 50 ఎకరాల వరకు అసైన్డ్ భూములను రైతుల నుంచి కాజేసి నీలగిరి మొక్కలు నాటి దర్జాగా పెంచుతున్నారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరిన్ని బంజరు భూముల కబ్జాలకు పాల్పడుతున్నట్లు పంచాయతీవాసులు ఆరోపిస్తున్నారు. గత వారం రోజులుగా కుసులవాడ పంచాయతీ సర్వే నంబర్ 35లో, పందలపాక పంచాయతీ బాకూరుపాలెం సర్వే నంబర్ 3లోని బోడికొండపై కొందరు టీడీపీ నాయకులు నీలగిరి మొక్కలు నాటుతున్నారు.

బాకూరుపాలెంలో బంజరులో యథేచ్ఛగా మొక్కలు

పందలపాక పంచాయతీ బాకూరుపాలెం సర్వే నంబర్ 3లోని బోడికొండపై సుమారు 100 ఎకరాల్లో స్థానిక టీడీపీ నాయకులు రమణ, సత్యనారాయణ గత వారం రోజులుగా యంత్రాలతో కొండను చదును చేసి నీలగిరి మొక్కలు నాటిస్తున్నారు. జేసీబీ ఈఎక్స్ 70 యంత్రాన్ని ఉపయోగిస్తున్నట్లు బాకూరుపాలెం గ్రామస్తులు తెలిపారు. గతంలో ఇదే సర్వే నంబర్‌లో స్థానికులు నీలగిరి మొక్కలు వేసుకోగా ఆనందపురం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది స్పందించి వాటిని తొలగించి హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే హెచ్చరికల బోర్డు ఉన్న ప్రాంతంతో పాటు పలుచోట్ల నీలగిరి మొక్కలు నాటుతున్నారు. దీని విలువ రూ.300 కోట్లకు పైగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ప్రశ్నించిన స్థానికులపై దాడులు చేస్తూ ఇప్పుడు తమ ప్రభుత్వం అధికారంలో ఉందని బెదిరిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది తమ గుప్పెట్లో ఉన్నారని.. ఎవరెన్ని అడ్డంకులు కలిగించినా ఆగేది లేదంటూ భూమిని చదును చేస్తూ మొక్కలు నాటేస్తున్నారు.



యంత్రాలతో కొండను చదును చేసిన దృశ్యం

మొక్కలు తొలగిస్తాం: తహసీల్దార్

గతంలో బోడికొండపై నాటిన 400 మొక్కలను స్వాధీనం చేసుకుని హెచ్చరికల బోర్డులు పెట్టామని తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఇప్పుడు అదే చోటే మళ్లీ మొక్కలు నాటుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సోమవారం ఉదయం సిబ్బందిని బోడికొండపైకి పంపించి నీలగిరి మొక్కలు తొలగిస్తామన్నారు. కుసులవాడ సర్వే నంబర్ 248లో కూడా దళితేతరులు నాటిన మొక్కలు తొలగించమని వీఆర్వో పురుషోత్తంకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పదే పదే ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి ఆక్రమణలకు పాల్పడే వారిని గుర్తించి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. ఇబ్బందికరంగా ఉన్న పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల జోలికొస్తే ఖబడ్దార్



సభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు హెచ్చరిక
- కూర్మన్నపాలెం నుంచి నెల్లిముక్కు వరకు మహాపాదయాత్ర

పెదగంట్యాడ/అగనంపూడి: స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి జోలికొస్తే ఖబడ్దార్ అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు హెచ్చరించారు. స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మహాపాదయాత్ర నిర్వహించారు. కూర్మన్నపాలెం నుంచి పెదగంట్యాడ నెల్లిముక్కు వరకు మహా పాదయాత్ర అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ, యాజమాన్యాల వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు.. ఆ నేరాన్ని కాంట్రాక్ట్ కార్మికులపై నెట్టడం సరికాదన్నారు. అందులో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికులను ఉపాధికి దూరం చేస్తున్నారని ఆరోపించారు. వీరిలో తమ విలువైన భూములను ప్లాంట్ కోసం త్యాగం చేసిన నిర్వాసితులు ఉన్నారని, వారి ఉపాధికి గండి కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు నేటి పాలకులు ఇచ్చిన హామీలు మరచి నేడు కేంద్ర ప్రభుత్వానికి వంత పాడుతున్నట్లు అనుమానిస్తున్నామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎం.శ్రీనివాస్, జిల్లా నాయకుడు జగన్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా ప్లాంట్‌లోని పరిణామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వం, ప్లాంట్ యాజమాన్య వైఖరిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించడం చేతకాని యాజమాన్యం కార్మికుల సంఖ్యపైన, వారి హక్కులపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సీఐటీయూ నాయకుడు ఎం.జగ్గునాయుడు కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి గండికొడితే పెద్ద ఎత్తున తిరుగుబాటు తప్పదన్నారు. కార్యక్రమంలో సిటూ నాయకులు ఆర్.ఎస్.వి.కుమార్, జి.శ్రీనివాస్, నమ్మి రమణ, ఎం.వి.రావు, సత్యవతి, రమణ, నారాయణరావు, ఆదిరెడ్డి శ్రీను, మసేను, సోమేష్, సుబ్రహ్మణ్యం, శశిభూషణ్, నర్సింగరావు తదితరులు ప్రసంగించారు.

నేత్రపర్వం.. నృత్యోత్సవం



మాధవపెద్ది మూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు



మహరి నృత్య రూపకం ప్రదర్శిస్తున్న ఒడిశా బృందం


మద్దిలపాలెం: భారతీయ సంప్రదాయ నాట్య ప్రదర్శనలతో కళాభారతి ఆడిటోరియం పులకించిపోయింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన నాట్యకళాకారులు తమ ప్రదర్శనలతో ఓలలాడించారు. మూడు రోజులుగా జరుగుతున్న వైశాఖీ నృత్యోత్సవ్ ఆదివారంతో ముగిసింది. మూడో రోజు కార్యక్రమాన్ని సూదగాని రవిశంకర్ నారాయణ్, నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఆర్ విక్రమ్ కుమార్ గౌడ్ తదితరులు ప్రారంభించారు. ఒడిశాకు చెందిన రూపశ్రీ మహాపాత్ర బృందం మహరి నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకోగా.. చైన్నెకి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య నిపుణుడు, మాధవపెద్ది మూర్తి తన బృందంతో కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు కనువిందు చేశాయి. కేరళకు చెందిన నాట్యశ్రీ బిరుదాంకితురాలు చిత్రా సుకుమారన్ చేసిన మోహినీయాట్టం అలరించింది. డాక్టర్ పేరాల బాల మురళీకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. నృత్య ప్రదర్శనల అనంతరం ఆయా కళాకారులకు అవార్డులు అందజేశారు. ప్రఖ్యాత కూచిపూడి నాట్య నిపుణుడు మాధవపెద్ది మూర్తి (చెన్నై) వైశాఖీ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024 అందుకున్నారు. ఒడిశాకు చెందిన నళినీ నిరూర్ నాయక్‌కు, కేరళకు చెందిన మోహినీయాట్టం కళాకారిణి చిత్ర సుకుమారన్‌కు వైశాఖీ ఎక్స్‌లెన్స్ పురస్కారాలు ప్రదానం చేశారు.



తొలి వెలుగు

సూర్య కిరణాలు చెట్లను చీల్చుకుంటూ నేలను తాకుతున్న ఈ అద్భుత దృశ్యం ఏజెన్సీలోనిది అనుకుంటే పొరపాటే. విశాఖ స్టీల్ సిటీలో ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ సుందర దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. సాధారణంగా పారిశ్రామిక ప్రాంతాల్లో ఇలాంటి దృశ్యాలను చూడటం అరుదు. కానీ స్టీల్ సిటీలోని కొన్ని ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించేందుకు చేపట్టిన చర్యల ఫలితంగా ఇది సాధ్యమైంది.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



నీలి సంద్రం.. నావల అందం


బెస్తవాడ నుంచి మహా నగరంగా రూపాంతరం చెందిన విశాఖకు సాగరతీరం ఒక మణిహారం. నీలి వర్ణంలో సముద్రం, వరుసగా నిలిపిన బోట్లు, వెనుక అందంగా కనిపిస్తున్న నగరం.. ఈ దృశ్యం మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. ఫిషింగ్ హార్బర్‌లో గంగపుత్రులు తమ బోట్లను లంగరు వేసి వరుసగా నిలిపి ఉంచడం చూస్తుంటే.. నగరానికి బోట్లతో ఒక గేటు ఏర్పాటు చేసినట్లు ఉంది కదూ.!

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బీచ్‌రోడ్డులో కారు బీభత్సం



సంఘటన స్థలంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభం



తుప్పల్లోకి దూసుకుపోయిన ద్విచక్ర వాహనం



నుజ్జయిన కారు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో ఆదివారం రాత్రి 8.45 గంటల సమయంలో ఓ కారు బీభత్సం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమిలికి చెందిన మీసాల వెంకట్ ఇద్దరు స్నేహితులతో కలిసి కారులో నగరం నుంచి వస్తున్నారు. అతి వేగంగా వస్తున్న వీరి కారు కె.నగరపాలెం దరి గోవుపేట వద్ద అదుపు తప్పి పక్కగా వస్తున్న మరో కారును బలంగా ఢీ కొట్టింది. అక్కడ నుంచి డివైడర్‌ను, సెంట్రల్ విద్యుత్ పోల్‌ను, అటుగా వస్తున్న మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డివైడర్ ధ్వంసం కాగా విద్యుత్ సెంట్రల్ పోల్ నేలకొరిగింది. కారు నుజ్జునుజ్జవగా ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. వెంకట్‌కు తీవ్ర గాయాలు కాగా ఆయన కారులో వస్తున్న మరో ఇద్దరు అక్కడ నుంచి పరారయ్యారు. మరో కారులో వస్తున్న కేదారిశెట్టి సుభాష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా వెంకట్ కారులో మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. సంఘటన స్థలానికి ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేసి, కేసు నమోదు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం సాధిద్దాం

ఆరిలోవ: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం సాధించడమే లక్ష్యంగా ప్రజలు భాగస్వాములు కావాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ, ఐఎన్ఎస్ విశ్వకర్మ, ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు సంయుక్తంగా ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా జోడుగుళ్లపాలెం, ఆర్.కె.బీచ్ ప్రాంతాలను శుభ్రం చేశారు. పేపర్లు ప్లేట్లు, ప్లాస్టిక్, ఖాళీ కొబ్బరి బొండాలు తదితర వ్యర్థాలను సేకరించి పారిశుధ్య కార్మికులకు అప్పగించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ ఫ్లకార్డులు, పోస్టర్లతో ర్యాలీ చేశారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోన్-2 జోనల్ కమిషనర్ సింహాచలం, సహాయ వైద్యాధికారులు బి.ప్రసాదరావు, కిశోర్‌కుమార్, ఐఎన్ఎస్ విశ్వకర్మ, ఏయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేయండి

సింధియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్‌ను ఆదివారం డిఫెన్స్ ప్రొడక్షన్ సెక్రటరీ సంజీవ్‌కుమార్ సందర్శించారు. యార్డ్‌లో ప్రాజెక్ట్‌లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్తు ప్రణాళికలపై ఆరా తీశారు. ఈసందర్భంగా షిప్‌యార్డ్ ఉద్యోగులు, అధికారులు చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. షిప్‌యార్డ్ మూలధన వ్యయాన్ని మరింత మెరుగుపరచాలని, పరిశోధన అంశాలను నూతన ఒరవడితో అభివృద్ధి చేసి పెట్టుబడి పెట్టాలని సూచించారు. పరిశ్రమ 4.0 సాంకేతికతలను పెంచాలని కోరారు. మేక్ ఇన్ ఇండియా కింద రానున్న రక్షణ, వాణిజ్య ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి సంస్థను మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

పారా పోటీల్లో దివ్యాంగులు మురిసె.!

- స్విమ్మింగ్ పోటీల చాంపియన్ విశాఖ
- జిమ్నాస్టిక్‌లో చిన్నారుల అద్భుత ప్రదర్శన
- రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటిన షూటర్లు



జిమ్నాస్టిక్ విజేతలకు బహుమతుల ప్రదానం



పోటీలకు సిద్ధమవుతున్న స్విమ్మర్లు



రైఫిల్ షూటింగ్ చేస్తున్న రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ గిరీశ

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో ఆదివారం క్రీడా పండగ జరిగింది. పారా స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, జిమ్నాస్టిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో దివ్యాంగ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. దివ్యాంగ స్విమ్మర్లు పూల్‌లో సత్తాచాటగా.. లక్ష్య సాధనలో రైఫిల్ షూటర్లు పోటీపడ్డారు. జిమ్నాస్ట్‌లు తమ విన్యాసాలతో అలరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ గిరీశ రైఫిల్ షూటింగ్ చేసి ఔత్సాహిక క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చిన్నారుల విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. పారా స్విమ్మింగ్ పోటీల్లో విజేతలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.

స్విమ్మింగ్‌లో... : రైల్వే స్టేడియం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. ఎస్ 4 కేటగిరీ నుంచి ఎస్ 14 వరకు 90 మంది పారా స్విమ్మర్లు పోటీపడ్డారు. ఫ్రీస్టయిల్, బ్యాక్‌స్ట్రోక్ లాంటి 50, వంద మీటర్ల స్విమ్మింగ్ అంశాల్లో పలువురు దివ్యాంగ స్విమ్మర్లు తమ ప్రత్యేకతను ప్రదర్శించారు. బ్లైండ్(అంధత్వం) పారా స్విమ్మర్లు సైతం వారి కేటగిరీల్లో పోటీ పడి సత్తాచాటారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర జట్టుగా వచ్చే నెల 19 నుంచి 22 వరకు గోవాలో జరిగే పోటీలకు హాజరవుతారు. విశాఖ పారా స్విమ్మర్లు చాంపియన్‌షిప్‌ను సాధించగా.. కృష్ణా జిల్లా సిమ్మర్లు ద్వితీయస్థానంలో, శ్రీకాకుళం జిల్లా స్విమ్మర్లు తృతీయస్థానంలో నిలిచారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

అలరించిన చిన్నారుల విన్యాసాలు

పాండురంగాపురంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ హాలులో జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమతుల్యత, బలం, చురుకుదనం, సమన్వయం తదితర అంశాలను కళాత్మకంగా ప్రదర్శించి శాప్ ఎండీ, కలెక్టర్‌లను అబ్బురపరిచారు. చిన్నారులు చేసిన ప్రదర్శనను వీరు ఆసక్తిగా వీక్షించారు. వైఎంసీఏ వద్ద జరిగిన రైఫిల్ షూటింగ్‌లో శాప్ ఎండీ క్రీడాకారుడిగా పోటీ పడ్డారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జిమ్నాస్టిక్స్‌ను ప్రోత్సహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.

ఆంధ్రా రంజీ కెప్టెన్‌గా రికీబుయ్

విశాఖ స్పోర్ట్స్: రంజీ ట్రోఫీలో ఆడే ఆంధ్రా జట్టుకు మరోసారి రికీబుయ్ నాయకత్వం వహించనున్నాడు. గత రంజీ సీజన్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన రికీబుయ్ ఇటీవలే ముగిసిన దులీప్ ట్రోఫీలో కూడా రెండు సెంచరీలతో పాటు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ను అందుకున్నాడు. ఇటీవల బీసీసీఐ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విడుదల చేయగా.. రంజీ ట్రోఫీలో 32 జట్లు తలపడుతున్నాయి. ఆంధ్రా జట్టు ఎలైట్ బీ గ్రూప్‌లో పోటీపడనుంది. హైదరాబాద్ జట్టుతో పాటు మరో ఆరు జట్లు ఈ గ్రూప్‌లో ఉన్నాయి. ఈ టోర్నీలో సత్తాచాటిన ఆటగాళ్లను ఇరానీ కప్‌లో ఆడేందుకు అర్హత కల్పిస్తారు. అక్టోబర్ 11న తొలి మ్యాచ్‌లో విదర్భతో ఆంధ్రా జట్టు ఆడటంతో ట్రోఫీ మొదలవుతుంది. 18న గుజరాత్‌తో, 26న హిమాచల్‌ప్రదేశ్‌తో ఆడనుంది. హిమాచల్‌ప్రదేశ్‌తో మ్యాచ్ విశాఖ వేదికగానే జరగనుండగా రాజస్థాన్, ఉత్తరాఖండ్ మ్యాచ్‌లు విజయనగరం వేదికగా జరగనున్నాయి. నవంబర్ 6న ఉత్తరాఖండ్‌తో, 19న హైదరాబాద్‌తో ఆడనుంది. అనంతరం సయిద్‌ముస్తక్ అలీ, విజయ్ హజారే ట్రోఫీల్లో ఆడనున్న ఆంధ్రా జట్టు తిరిగి రంజీ మ్యాచ్‌ల్లో జనవరి 23న పుదుచ్చేరితో, లీగ్ దశలో చివరిదైన మ్యాచ్ 30న రాజస్థాన్‌తోనూ తలపడనుంది. జట్టుకు రికీబుయ్ కెప్టెన్‌గా, షేక్ రషీద్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. కె.ఎస్.భరత్, హనుమ విహారీ, నితీష్‌కుమార్, అశ్విన్ హెబ్బర్, లలిత్‌కుమార్, హేమంత్‌రెడ్డి, మహీన్‌కుమార్, సత్యనారాయణ, అభిషేక్ రెడ్డి, స్టీఫెన్, వంశీకృష్ణ, విజయ్ జట్టుకు ఎంపికయ్యారు.

గంజాయి చాకెట్లు విక్రయిస్తున్న వ్యాపారి అరెస్ట్

133 చాక్లెట్లు స్వాధీనం

అల్లిపురం: గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న పాన్‌షాప్ యజమానిని టూటౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 133 చాక్లెట్లను (660 గ్రాములు) స్వాధీనం చేసుకున్నారు. టూ టౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్ప్రింగ్‌రోడ్డులో ఒక పాన్‌షాప్‌లో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిందితుడు మనోజ్‌కుమార్‌ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 133 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్, టూటౌన్ ఎస్ఐ శంకర్‌లను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

ఘనంగా గురుపూజ మహోత్సవం



ప్రైవేట్ పాఠశాలల గురువులను సత్కరించిన అపుస్మా ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) ఆధ్వర్యంలో విశాఖ జిల్లా స్థాయిలో 120 పాఠశాల నుంచి 181 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. ఏయూ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆర్జేడీ బి.విజయభాస్కర్ జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆర్జేడీ ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రకటనలు, ర్యాంకులు పక్కన పెట్టి విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేయాలని ఆర్జేడీ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, అపుస్మా చీఫ్ మెంటర్ ఎ.కృష్ణారెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు కోశాధికారి ఎం.వి.రావు, ప్రతినిధులు ఎం.వి.వి.సత్యనారాయణ, ఎం.రాము నాయుడు, పి.కల్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.